సమయంలో జరిగిందో దీనివల్ల తెలుస్తుంది. దాన్నిబట్టి ఆ సమయంలో అక్కడెవరున్నారో తెలుసుకోవచ్చు. ఇదీ వారి ఉపాయం.

ఈ విషయాన్ని వారు విమానపు సిబ్బందికి కూడా చెప్పలేదు.

అయితే విమానం గాలిలో వుండగా స్టూవర్డెస్ మిస్, మిస్ మూసాస్‌బేకర్ ఈ శబ్దం విని టైం బాంబ్ అనుకుంది. వెంటనే విమానం సిబ్బందిని హెచ్చరించింది.

బోయింగ్ 727 విమానాన్ని పైలెట్ వెంటనే బెర్లిన్‌లో దించేశాడు. ఎనభైమంది ప్రయాణీకుల్ని వెంటనే విమానం లోంచి బయటికి పంపేశారు. విమానమంతా వెతికి విషయం తెలుసుకున్నారు.

మీనియేచర్ బాటిల్ ఒక్కొక్కదాని ఖరీదూ 17 పెన్నీలు కాగా ఎమర్జెన్సీ లాండింగ్‌కి 6,500 పౌండ్లు. (సుమారు 22,500 రూపాలు) ఖర్చయింది.

— కిశోర్.జె.

ఓ బుజ్జమ్మ కథ

"అమ్మా! ఉదయం నుండి నాకు ఎలాగో వుందే!"

"ఎలాగో వుండడమేమిటే?"

"ఉదయం రెండు సార్లు వాంతి గూడా అయిందే. కళ్ళు గూడా తిరుగుతున్నాయి"

"నా బంగారు తల్లే! నీకు చిన్నికృష్ణుడు పుట్టాలే" అంటూ బుజ్జమ్మ మురిసిపోయింది.

కామేశ్వరి అందంగా సిగ్గుపడింది.

"నాకు అమ్మాయే పుట్టాలమ్మా" అంది కామేశ్వరి ముసిముసి నవ్వులతో...

"అమ్మాయి పుడితే లక్ష్మీదేవి పుట్టినట్లేనే" అంది బుజ్జమ్మ నవ్వుతూ.

□ □ □ □ □

'కామేశ్వరి'కి నొప్పులు ప్రారంభమయ్యాయి.

అది ఒక పల్లెటూరు. ఆ వూరిలో ఆస్పత్రి లేదు. ఆస్పత్రికి వెళ్ళాలంటే పట్నం వెళ్ళవలసిందే.

ఎద్దుల బండిలో కామేశ్వరిని పడుకోబెట్టారు.

కామేశ్వరి బాధతో మెలితిరిగి పోతోంది.

బుజ్జమ్మ గుండెలు కంగారుతో 'లబ్... డబ్..." అంటూ వేగంగా కొట్టుకుంటున్నాయి.

అమ్మమ్మను అవబోతున్నాననే సంతోషం ఆ కంగారును డామినేట్ చేస్తోంది.

కొంతసేపటికి...

"అమ్మా!" అంటూ కామేశ్వరి బిగ్గరగా అరచి తల పక్కకు వాల్చేసింది.

కొన్ని నిముషాలకు గాని జరిగిన ఘోరమేమిటో బుజ్జమ్మకు అర్థం కాలేదు.

మరుక్షణం ఆమెకు కుప్పలా కూలిపోయింది.

□ □ □ □ □

కామేశ్వరి శవానికి దహన సంస్కారం జరుగుతుంది.

కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న బుజ్జమ్మను కూర్చోబెట్టారు.

కామేశ్వరి భర్త కోటయ్య దహన సంస్కారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాడు.

కాసరి కర్రతో చితిని సర్దుతున్నాడు.

హఠాత్తుగా ఏదో ఒక వస్తువు ఎగిరి బుజ్జమ్మ ఒడిలో పడింది!

"ఆ! నా కోరిక తీరింది. నా మనుమడు నా ఒళ్ళోకే చేరాడు. నా ఒడిలోనే పడుకుంటాడు. నా ఒడిలోనే ఎప్పటికీ వుంటాడు" అంటూ బుజ్జమ్మ పిచ్చిగా కేకలు వేస్తుంటే అక్కడున్న వాళ్ళు గూడా ఏడ్చేశారు.

కాసరి బుజ్జమ్మ దగ్గరకు వచ్చి, చితిలో నుండి ఎగిరి ఆమె ఒడిలోకి పడిన నిర్జీవమైన శిశువును తీసుకుని మరలా చితిలోకి విసిరేశాడు.

ఆ దృశ్యం చూసిన బుజ్జమ్మ నిలువునా కుప్పకూలి పోయింది.

ఇక మళ్ళీ ఆమె లేవలేదు.

— కె.వి. మల్లేశ్వరరావు